క్లుప్తంగా

ఆరోపణలు సరికాదు

బలిజిపేట: పెదపెంకి–1 పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నికల విషయంలో ఉన్నతాధికారుల సూచనలతో, నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించామని ప్రధానోపాధ్యాయుడు ఎం.సాంభమూర్తి తెలిపారు. చెప్పిన సమయానికి ఇరువర్గాలవారు హాజరు కాలేదని, అయినప్పటికి వేచిచూసి కోరమ్ సభ్యులు వచ్చిన తరువాత మాత్రమే ఎన్నిక నిర్వహించామన్నారు. ఏ వర్గానికి పక్షపాతంగా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. సభ్యులు ఆవిధంగా ఆరోపించడం సరికాదన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాధాకాంత్

సీతానగరం: గర్భిణులు సుఖప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరాలని పెదంకలాం పీహెచ్‌సీ వైద్యుడు రాధాకాంత్ అన్నారు. పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న పలువురు గర్భిణులకు మందులు అందజేశారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణుల ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఇంటింటి సర్వే వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రూరల్ సీఐగా గోవిందరావు



పార్వతీపురం టౌన్: పార్వతీపురం రూరల్ సీఐగా ఎస్.గోవిందరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సీఐగా విధులు నిర్వహించిన రవికుమార్ ఎస్‌కోట సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ.. పార్వతీపురం సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సారా రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మూలనకు కృషి చేస్తామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బంగారు వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

సాలూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం బంగారు చీరతో అలంకరించారు. ఆలయ వార్షికోత్సవం, శ్రావణ శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



సీసీకాలువ నిర్మాణ పనులు

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. మండల కేంద్రంలోని గూడెంలో సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో చేపడుతున్న సీసీకాలువ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూడెంలో రోడ్లన్నీ అధ్వానంగా తయారవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురుగునీరు రోడ్డుపై నిలిచిపోకుండా సీసీకాలువల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే పెదబోగిలి పంచాయతీ పరిధి బుడ్డిపేట, అప్పయ్యపేట, పెదబోగిలి, సీతానగరం గ్రామాల్లో విద్యుద్దీకరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎస్.అరుణశ్రీ

సీతానగరం: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, బొబ్బిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. జోగింపేట కేజీబీవీని శుక్రవారం సందర్శించారు. వంటగదులు, డార్మెంటరీ, తాగునీటి సరఫరా, తరగతి గదులు, విద్యార్థులకు అందుతున్న ఇతర వసతులను పరిశీలించారు. వసతులు బాగున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్భయ, నూతన చట్టాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు.

గిరిజనులు అంటే గిరులు, సిరులు



నృత్యం చేస్తున్న గిరిజన విద్యార్థినులు

- గిరిజన వర్సిటీ తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత మంత్రి సంధ్యారాణిదే..
- గత ప్రభుత్వంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తిచేయాలి
- ఆదివాసీ దినోత్సవంలో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్:

గిరిజనులు అంటే గిరులు, సిరులు అని, అయితే వాస్తవ పరిస్థితులు చూస్తే గిరులు మాత్రమే మనకు మిగులుతున్నాయని, సిరులు మన వద్ద కనిపించడం లేదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాలూరు నియోజకవర్గంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి ఎంతో కృషి చేశానని, మెంటాడ మండలంలో వర్సిటీ ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని, కానీ నేడు కూటమి ప్రభుత్వం గిరిజన వర్సిటీని ఎస్‌కోట తరలించేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. వర్సిటీ ఇక్కడ నుంచి తరలించకుండా చూడాల్సిన బాధ్యత గిరిజన శాఖామంత్రి సంధ్యారాణిపై ఉందన్నారు. గిరిజన యూనివర్సిటీ గిరిజన ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలన్నారు. మెంటాడ మండలం నచ్చకపోతే సాలూరు, పాచిపెంట మండలాల్లో ఏర్పాటు చేయాలన్నారు. అంతేగాని గిరిజనేతర ప్రాంతాలకు తరలిపోతే ఊరుకునేదిలేదన్నారు. గిరిజనుల యాష, భాష, కట్టుబాట్లు, వారసత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాబోయో తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలు చేరవేసేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.



రాజన్నదొరను సన్మానిస్తున్న గిరిజన నాయకులు

● వేడుకల నిర్వహణపై సమాచారం లేదు

2023లో సాలూరులో ఆదివాసీ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని, ఆ కార్యక్రమానికి ప్రస్తుత గిరిజన శాఖామంత్రి సంధ్యారాణిని కూడా పిలవడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం ఆదివాసీ దినోత్సవాల నిర్వహణపై మాజీ గిరిజన శాఖామంత్రిని అయిన తనకు కనీస సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం 2014–19లో గిరిజన శాఖామంత్రి కూడా లేరు. అలాగే గిరిజనాభివృద్ధికి కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తుచేశారు. అదే జగనన్న ప్రభుత్వంలో గిరిజనుల సంక్షేమం కోసం 2019–24 మధ్య కాలంలో రూ.22 వేల కోట్లు కేటాయించారన్నారు. గిరిజన రైతులకు రైతుభరోసా పథకం క్రింద రూ.2,224 కోట్లు అందించడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం ఇంతవరకు ఒక్క రూపాయి కూడా రైతు భరోసా అందించలేదన్నారు. జీఓ నంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గతంలో దీనిపై కోర్టులో కేసు నడుస్తున్నందున ఈ విషయంపై తాను మాట్లాడలేదని, ఇప్పుడు కోర్టు తీర్మాణం చేసిందని జీఓ నెం.3ని పునరుద్ధరించేందుకు గిరిజన శాఖామంత్రి సంధ్యారాణి ప్రయత్నించాలని కోరారు. జీఓ నెం.3 అమలైతే గిరిజన పిల్లల భవిష్యత్ బాగుంటుందన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తిచేయాల్సిన బాధ్యత మంత్రి సంధ్యారాణిపై ఉందన్నారు. అంతకుముందు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి గిరిజన సాంప్రదాయ నృత్య ప్రదర్శన చేశారు. తోణాం సర్పంచ్ ముvvల ఆదియ్య అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో గిరిజన నాయకుడు కొండగొర్రి ఆదియ్య, చోడిపల్లి బిసు, పలువురు సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

● సీపీఎం ఆధ్వర్యంలో..

సాలూరు పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. గాంధీ పార్కు వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

● అడవితల్లికి వందనం



పాచిపెంట: ఆదివాసీ జెండాను ఎగురవేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: మండలంలో చీపురువలస సమీపంలో పారమ్మకొండ వద్ద గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండాను ఎగురవేసి, అడవితల్లి విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, గిరిజనుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

శ్రావణ లక్ష్మికి ప్రత్యేక పూజలు



సాలూరు: కామాక్షమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సాలూరు/సీతానగరం: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి, పంచముఖేశ్వరి అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాస పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో సువర్ణముఖీ నది ఒడ్డున వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే మండలంలోని గుచ్చిమి, మరిపివలస, నిడగల్లు, కె.ఎస్.పురం, లచ్చయ్యపేట, గాదెలవలస, తామరఖండి గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.



సీతానగరం: పూజలందుకుంటున్న మహాలక్ష్మీ అమ్మవారు

గిరిజనులను ఆదుకోండి

పార్వతీపురంటౌన్: కేంద్ర బడ్జెట్ వల్ల గిరిజనులకు ఉపయోగం లేదని వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం అయ్యర్ల జిల్లా కార్యదర్శి పి.సంఘం అన్నారు. మండలంలోని పెద్ద మరికి పంచాయతీ కొత్తూరు గ్రామంలో శుక్రవారం గిరిజనులతో కలిసి ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా.. గిరిజనుల బతుకులు అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూమికి పట్టాలు ఇవ్వాలని, గిరిజనులు పండించే పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, అలాగే ఎస్సీ ఎస్టీ మీద దాడులు అరికట్టాలని కోరారు. గిరిజనుల భూములను ఆక్రమించేవారిపై చర్యలు తీసుకోవాలని, గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకం కింద గిరిజనులకు 200 రోజులు పని కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరారు. గిరిజనులకు ఐటీడీఏ నుంచి ఎరువులు, పురుగు మందులు, సబ్సిడీ లోన్లు, సలహాలు సూచనలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎ.భాస్కరరావు, చిరంజీవులు, ఒ.వెంకటి, ఎ.వెంకటి, సోమమ్మ, రామయమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.సంఘం

ఎస్‌ఎంసీ చైర్మన్ పేరు మార్చాలని ప్రిన్సిపాల్‌పై ఒత్తిడి

సాలూరు రూరల్: పురోహితునివలస ఆదర్శ పాఠశాలలో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు బంకురు శ్రీనివాసరావు చైర్మన్‌గా ఎన్నిక కాగా ఆయన పేరును మార్చాలని పాఠశాల ప్రిన్సిపాల్ అంజలీదేవిపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గిరిజన శాఖామంత్రి సంధ్యారాణి పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీకి చెందిన నాయకులు మోడల్ స్కూల్ పాఠశాల చైర్మన్‌గా ఎన్నిక అవ్వాలని మంత్రి స్థానిక నాయకులకు ఆదేశించారని, ఆ మేరకు ప్రిన్సిపాల్ తమ పార్టీ మద్దతుదారులు సహకరించాలని ముందుగానే కొన్ని పేర్లను ప్రిపాల్‌కు సూచించినట్లు తెలిసింది. అయితే అందుకు భిన్నంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు బంకురు శ్రీనివాసరావు ఎస్‌ఎంసీ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో శ్రీనివాసరావు పేరుకు బదులు తమ అనుయాకుల పేరు మార్చాలని మంత్రి పేరుతో టీడీపీ నాయకులు ప్రిన్సిపాల్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలా చేయకపోతే లాయర్ నోటీసులు పంపిస్తామని బెదిరింపులకు దిగుతున్నట్లు పలువురు చెప్పుకుంటున్నారు. ఇదే విషయాన్ని చైర్మన్‌గా ఎన్నికైన బంకురు శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు.

వాటర్‌ట్యాంక్ క్లీనింగ్

బలిజిపేట: బలిజిపేట ఎస్సీ కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకును శుభ్రం చేయించడంతో పాటు, క్లోరినేషన్ చేయించినట్లు సర్పంచ్ రాఘలత తెలిపారు. సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ట్యాంకును శుభ్రం చేయించినట్లు చెప్పారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

పార్వతీపురంటౌన్: విజయవాడలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆశాజ్యోతి అయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలని చూడడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రోత్సాహకాలు అందజేత

పార్వతీపురం: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాల్లో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసి అధిక దిగుబడి సాధించిన పలువురు రైతులను కలెక్టర్ సత్కరించారు. అలాగే పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లలో టాపర్స్‌గా నిలిచిన అడ్డాకుల బిందుమతి, నిమ్మక సంతోష్‌లను, వాలీబాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించిన తిమ్మక దీపక్ బృందానికి కలెక్టర్ దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరీ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, జేసీ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ ఎస్.సేతుమాధవన్, ఆర్డీఓలు కె.హేమలత, వీవీరమణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి అల్లూరు విగ్రహాన్ని బహూకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, తదితరులు

విత్తనోత్పత్తి పథకంపై అవగాహన

బలిజిపేట: విత్తనోత్పత్తి పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని డీఆర్‌సీ, జిల్లా ఏడీ భారతి సూచించారు. అరసాడలో విత్తనోత్పత్తి పథకంపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతులే స్వయంగా విత్తనాలుగా తయారుచేయాల్సి ఉంటుందన్నారు. వాటిని వచ్చే సీజన్‌లో మిగిలిన రైతులకు అందించడం వల్ల విత్తనాల కొరత తీరుతుందని, ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. రైతులకు 1064 వరి వంగడం విశిష్టత, ఎరువుల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ, కాలిబాటల ఉపయోగం, కేలీల తొలగింపు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు, వీఏఏ ఐశ్వర్య, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌సీ భారతి

పేదవాడికి పురుగుల బియ్యమా!



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

- మండలంలో రేషన్ డిపోలు **44**
- రేషన్ పంపిణీ వాహనాలు **12**
- బియ్యం కార్డులు **17,903**
- ఏఏవై కార్డులు **1,467**
- నెలకు సరఫరా చేసే బియ్యం **270** మెట్రిక్ టన్నులు



బియ్యంలో కనిపిస్తున్న పెంకుపురుగులు

బలిజిపేట: రేషన్ బియ్యంలో పెంకుపురుగులు కనిపిస్తుండడంతో నిరుపేదలు వాటిని తినలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. రేషన్‌కార్డు లబ్ధిదారులకు గత రెండు నెలలుగా బియ్యం మాత్రమే అందిస్తున్నారు. ఇతర నిత్యావసర సరుకులు సరఫరా చేయడంలేదు. గత ప్రభుత్వంలో బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, చోడిపిండి, గోదుమలు, తదితర సరుకులు అందించేవారని, ప్రస్తుతం బియ్యం తప్ప మరే ఇతర సరుకులు పంపిణీ చేయడం లేదని లబ్ధిదారులు అంటున్నారు. బియ్యంలో పెంకుపురుగులు ఉంటున్నాయని, వాటిని ఎలా తినాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇంటింటికీ రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేసేవారని, ఇప్పుడు ఇష్టమొచ్చినట్లు సరుకులు అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా రేషన్ కార్డుదారులకు నాణ్యమైన బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై సీఎస్‌డీటీ రమేష్‌బాబు వివరణ కోరగా ప్రస్తుతానికి బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నామని అన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- అంబేడ్కర్ విగ్రహంపై దాడిని ఖండిస్తున్నాం..
- హోం మంత్రి ఖండించకపోవడం దౌర్భాగ్యం
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, కూటమి ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డున గల అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేసినా హోంమంత్రి ఖండించకపోవడం దౌర్భాగ్యమని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలియజేశారు. అనంతరం ఇందిరా కాలనీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ.. గత రాత్రి ఎన్డీఏ ప్రభుత్వం ప్రోద్బలంతో కొందరు తెలుగుదేశం దుష్టశక్తులు, అల్లరి మూకలు డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్మృతివనం వద్ద ఉన్న మహావిగ్రహంపై దాడికి తెగపడ్డారని ఆరోపించారు. ఈ దుచ్చర్యను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నారా చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రంలో అహింస రాజ్యమేలుతోందని, మహిళలకు రక్షణ లేదని, మహిళలపై, చిన్నపిల్లలపై అత్యాచారాలు, హత్యోన్మాద కార్యక్రమాలు మితిమీరి పోతున్నాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రోత్బలంతో వారి నాయకులు, కార్యకర్తలు నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక మూల వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, మద్దతుదారులపై హత్యారాజకీయాలకు ఒడిగడుతూ రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు.

హోం మంత్రి స్పందించకపోవడం అన్యాయం

రాష్ట్రంలో ఒక దళిత మహిళ హోం మంత్రిగా ఉన్నప్పటికీ అంబేడ్కర్ విగ్రహంపై చేసిన దాడిని ఖండించకపోవడం నిజంగా దౌర్భాగ్యమని, నాడు ఆయన తీసుకొచ్చిన రాజ్యాంగం ద్వారానే నేడు ఎంతోమంది దళితులు రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని, రాష్ట్ర హోం మంత్రి ఈ అంశంపై తక్షణం స్పందించి దోషులకు తగిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఎంపీపీలు మజ్జి శోభారాణి, బలగ శ్రీరాములునాయుడు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, బొంగు చిట్టిరాజు, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, తదితరులు

ఏఐటీయూసీ సమావేశాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్

పార్వతీపురంటౌన్: సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో విశాఖపట్నంలోని గురజాడ కళాక్షేత్రంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 10.30 గంటలకు పార్వతీపురం ఎన్జీఓ సమావేశం మందిరంలో జిల్లా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుగత అశోక్, సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు హాజరు కానున్నారన్నారు. జిల్లాలో ఉన్న ఆస్పత్రి కార్మికులు, హమాలీలు, మున్సిపల్ కార్మికులు సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఆయనతో పాటు జిల్లా చేతి వృత్తుల సంఘ కార్యదర్శి సింహాద్రి దుర్గారావు, చిరంజీవులు, తదితరులు ఉన్నారు.